క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో

వేములవాడరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా విద్యాధికారి రమేశ్ అన్నారు. మండలంలోని చెక్కపల్లి గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చూడాలని, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు కిషన్, పద్మజ తదితులున్నారు.

విరాళం అందజేత



విరాళం అందిస్తున్న రాజేందర్

రుద్రంగి: రుద్రంగిలోని అయ్యప్ప ఆలయ అభివృద్ధికి మండలకేంద్రానికి చెందిన ఎర్రం రాజేందర్ రూ.10116, అన్నదాన కార్యక్రమానికి 50 కిలోల బియ్యం అందించారు. అయ్యప్ప మహాన్నదాన కార్యక్రమానికి దాతలు ముందుకు వచ్చి కార్యక్రమం విజయవంతం చేయాలని గురుస్వామి చెలుకల తిరుపతి కోరారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు అట్టపెల్లి మల్లేశం, ఎర్రం శ్రీనివాస్, అయ్యప్ప స్వాములు, తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి బంగారు పతకానికి ఎంపిక

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల 'ఎనర్జీ క్లబ్స్ ఇన్ స్కూల్స్' విభాగంలో రాష్ట్రస్థాయి బంగారు పతకానికి ఎంపికైనట్లు హెచ్‌ఎం ప్రేమలత తెలిపారు. ఈనెల 20న హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ విశ్వేశ్వరయ్య భవనంలో రాష్ట్రగవర్నర్, విద్యుత్ శాఖ మంత్రి చేతులమీదుగా బంగారు పతకం అందజేయనున్నట్లు తెలిపారు. 'ఆదిత్య హార్నెస్ క్లబ్' ఆధ్వర్యంలో విద్యుత్ ఆదాచేసేందుకు పాటించిన విధానాల మూలంగా అవార్డు వచ్చిందన్నారు. హెచ్‌ఎం ప్రేమలత, నోడల్ అధికారి మహేశ్చంద్రను సర్పంచ్ బాలరాజు, భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య యాదవ్, ఎస్‌ఎంసీ చైర్మన్ వేణు అభినందించారు.

అధిక ఫీజులపై సమావేశం నిర్వహిస్తాం

ముస్తాబాద్: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులపై త్వరలోనే సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో రమాదేవి తెలిపారు. ఇప్పటికే ప్రైవేట్ స్కూళ్లకు నోటీసులు జారీ చేశామన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలపై నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. డీఈవో కార్యాలయంలో వివరాలు సేకరిస్తున్నామన్నా రు. వారంరోజుల్లో ప్రైవేటు పాఠశాలలు, యాజమాన్యాలతోపాటు విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఐదుగురికి జైలు

వేములవాడరూరల్: వేములవాడరూరల్ మండల పరిధిలో డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురికి జరి మానాతోపాటు జైలుశిక్ష పడినట్లు రూరల్ ఎస్సై మారుతి తెలిపారు. ఇందులో పులి మధుకు ఒక్కరో జు జైలు, రూ.2వేల జరిమానా, పిట్ల బాలమల్లేశంకు 7 రోజుల జైలు, రూ.2వేల జరిమానా, ఎక్కల్‌దేవి మధు, నల్లగొండ మహేశ్, పత్యం బాలరాజులకు రూ.2వేల జరిమానా వేసినట్లు వివరించారు.

కానిస్టేబుల్‌కు అభినందన

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల పోలీస్‌స్టేషన్‌లో బ్లూకోల్ట్స్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కరీమ్‌ను పలువురు అభినందించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట మల్లాపూర్‌కు చెందిన బాస రాజయ్య (60)ను ద్విచక్రవాహనం ఢీకొనగా తీవ్రగాయాలయ్యాయి. అక్కడే ఉన్న కరీమ్ రాజయ్యను బైక్‌పై సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించారు. దీంతో కానిస్టేబుల్ కరీమ్‌ను శభాష్ అంటూ మండలవాసులు అభినందించారు.

రెచ్చగొట్టే పోస్టులు పెట్టొద్దు

ముస్తాబాద్: సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని ఎస్సై శేఖర్‌రెడ్డి హెచ్చరించారు. మండలకేంద్రంలో శనివారం ఎస్సై మాట్లాడారు. ఇటీవల ఎన్నికల నేపథ్యంలో పలు పార్టీల నాయకులు అనుచిత పోస్టింగ్‌లు పెడుతున్నారన్నారు. అలాంటి వారికి ఇప్పటికే కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. కొంత మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు.

వెల్జీపూర్‌లో చిరుత కలకలం?

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం వెల్జీపూర్‌లో రైతు బొల్లారం నాగరాజుకు చెందిన లేగదూడను చిరుతపులి చంపి తినడంతో గ్రామంలో భయాందోళన నెలకొంది. శుక్రవారం రాత్రి లేగదూడను చిరుత దాడిచేసి చంపినట్లు నాగరాజు తెలిపాడు. చిరుత పాదముద్రలు గుర్తించినట్లు చెప్పాడు.

రెవెన్యూ ఆఫీస్ ఖాళీ

- సిరిసిల్ల తహసీల్దార్ ఆఫీస్‌లో ఖాళీ కుర్చీలు
- సెలవులో అధికారి..
- కనిపించని మిగతా సిబ్బంది
- ఎదురుచూసి వెళ్లిపోయిన ప్రజలు

సాక్షి విజిట్


సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ ఆఫీస్‌లో శనివారం అధికారులు ఎవరూ విధుల్లో కనిపించలేదు. అధికారి సెలవులో ఉండగా.. సిబ్బంది సీట్లు వదిలిపెట్టి ఎటో వెళ్లిపోయారు. విధి నిర్వహణలో ఉండాల్సిన రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇలా ఆఫీస్‌లో ఎవరూ ఉండకపోవడం చర్చనీయాంశమైంది.

సెలవులో తహసీల్దార్

సిరిసిల్ల తహసీల్దార్ షరీఫ్ మొహియొద్దీన్ జ్వరంతో బాధపడుతూ సెలవు పెట్టినట్లు సమాచారం. శనివారం ఉదయం 11 గంటల సమయంలో ఆఫీస్‌లో ఉండాల్సిన డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ, సీనియర్ అసిస్టెంట్లు కుమార్, శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ నర్సింహారెడ్డి, రికార్డు అసిస్టెంట్లు యాదగిరి, ముక్తేశ్వరి సీట్లలో లేరు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం ఫీల్డ్‌కు వెళ్లినట్లు సమాచారం. డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ కలెక్టరేట్‌లో మీటింగ్‌కు వెళ్లినట్లు తెలిసింది. తహసీల్దార్ సెలవులో ఉండగా.. ఆఫీస్ స్టాఫ్ ఎవరూ లేకపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. గతమెంతో ఘనచరిత్ర గల సిరిసిల్ల తహసీల్దార్ ఆఫీస్‌లో ఇలా ఎవరికి వారు.. యమునా తీరే అన్నట్లుగా వదిలేయడం గమనార్హం.

ఎన్నికల మూడ్‌లోనే..

డిసెంబరు 3వ తేదీ వరకు రెండు నెలలుగా ఎన్నికల విధుల్లో బిజీగా ఉండగా.. సామన్యులకు రెవెన్యూ అధికారులు దొరకడం కష్టంగా ఉండేది. ఎన్నికలు ముగిసినప్పటికీ రెవెన్యూ అధికారులు అదే మూడ్‌లో ఉన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సిరిసిల్లతోపాటు ఏడు విలీన గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ పనుల కోసం తహసీల్దార్ ఆఫీస్‌కు రాగా.. అధికారులెవరూ కనిపించలేదు. రెవెన్యూ పరమైన పనుల కోసం వచ్చిన వారు నిరాశతో వెనుదిరిగారు.



తలుపు తీయని రికార్డు అసిస్టెంట్ గది.



ఖాళీ కుర్చీలతో సిరిసిల్ల డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్ల గది.

పిల్లల సర్టిఫికెట్ల కోసం వచ్చాం



మాది విద్యానగర్. కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణపత్రాల కోసం తహసీల్దార్ ఆఫీస్‌కు వచ్చాం. అధికారులెవరూ అందుబాటులో లేకపోవడంతో తిరిగి వెళ్తున్నాం. మరోసారి ఆఫీస్‌కు వస్తాం.

– రాజు దంపతులు, విద్యానగర్

ఆదాయ సర్టిఫికెట్ కావాలి



మాది సిరిసిల్లలోని నెహ్రూనగర్. నా కూతురు భవానికి ఆదాయ సర్టిఫికెట్ కావాలని వచ్చిన. మీసేవ కేంద్రంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నా. కానీ రెవెన్యూ అధికారులు ఆఫీస్‌లో ఎవరూ లేక పోవడంతో తిరిగి వెళ్తున్నా.

– గాజుల బాలరాజు, నెహ్రూనగర్

కలెక్టరేట్‌కు వెళ్లాను



తహసీల్దార్ సెలవులో ఉన్నారు. నేను కలెక్టరేట్‌లో మీటింగ్ ఉంటే వెళ్లాను. ఆర్‌ఐ ఫీల్డ్‌లో ఉన్నారు. ఏనాడు కూడా నేను ఆఫీస్‌కు లేట్‌గా రాను. మాకు అటెండర్ కూడా లేడు. మా ఆఫీస్ స్టాఫ్ అక్కడే ఉండి ఉంటారు. రెవెన్యూ పరమైన సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేదు.

– మురళీకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్, సిరిసిల్ల

రాజన్న సేవలో అడిషనల్ కలెక్టర్



స్వామివారి ప్రసాదం అందిస్తున్న ఆలయ ఏఈవో

వేములవాడ: అడిషనల్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పూజారి గౌతమి వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు తహసీల్దార్ మహేశ్ స్వాగతం పలికారు. ప్రత్యేక దర్శనం అనంతరం మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు స్వామి వారి ప్రసాదాలు అందించారు.

పూలమొక్క అందజేత

సిరిసిల్లటౌన్: జిల్లాకు కొత్తగా నియమితులైన అడిషనల్ కలెక్టర్ పి. గౌతమిని శనివారం సిరిసిల్ల మున్సిపల్ ఇన్‌చార్జి కమిషన్ మీర్జా ఫసహత్ అలీబేగ్ కలిశారు. కార్యాలయంలోమర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు.

నారుమడి ధ్వంసం

వీర్నపల్లి: మండలకేంద్రంలో చింతల చిరంజీవికి చెందిన నారుమడిని అడవిపందులు ధ్వంసం చేశాయి. శుక్రవారం అర్ధరాత్రి గుంపులుగా వచ్చి ధ్వంసం చేసినట్లు తెలిపారు. మండలంలోని రైతుల పరిస్థితి ఇలాగే ఉందని, ఇప్పటికైనా అధికారులు అడవిపందుల బారినుంచి పంట లను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాధవి

వేములవాడరూరల్: పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి అన్నారు. శనివారం వేములవాడ సినారె కళామందిర్‌లో క్రిస్మస్ సందర్భంగా 16వ వార్షికోత్సవ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని మతాలకు సమాన గౌరవం ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంగ స్వామి, పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, ఫాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషిచేయాలి

తంగళ్లపల్లి: మండలంలోని తాడూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శనివారం మోటివేషనల్ స్పీకర్, లైఫ్ స్కిల్స్ ట్రైనర్ తిరుపతి ఆధ్వర్యంలో ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్య సాధనకు కృషిచేయాలన్నారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. హెచ్‌ఎం ర వీందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మోటివేషనల్ స్పీకర్‌తో తాడూరు విద్యార్థులు

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



పటాకులు కాలుస్తున్న నాయకులు



లడ్డూ ప్రసాదం అందిస్తున్న డీసీసీ కార్యదర్శి

ఎల్లారెడ్డిపేట: వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రభుత్వ విప్‌గా నియమితులవడంపై మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం సంబరాలు నిర్వహించారు. పాత బస్టాండ్‌లో పటాకులు కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో రెండు పథకాలను అమలుచేస్తున్నట్లు తెలి పారు. మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, సాహెబ్, గిరిధర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చాగౌడ్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను ప్రభుత్వ విప్‌గా నియమించడంపై హర్షిస్తూ మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ బస్టాండ్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. పటాకులు కాల్చి, స్వీట్లు పిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గొట్టే ప్రభాకర్, పార్టీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు ముస్కు పద్మ, మాజీ జెడ్పీటీసీ సభ్యులు లింగారెడ్డి, మాజీ సనుగుల సింగిల్‌విండో అధ్యక్షుడు ముస్కు ముకుందరెడ్డి, చందుర్తి సింగిల్ విండో ఉపాధ్యక్షుడు పుల్కం మోహన్, నాయకులు పులి సత్తయ్య, దెబ్బటి వెంకన్న , దారం చంద్రం, వెల్పుల దేవస్వామి తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదం వితరణ

రుద్రంగి: వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను ప్రభుత్వ విప్‌గా నియమించడంపై హర్షం వ్యక్తంచేస్తూ డీసీసీ కార్యదర్శి చెలుకల తిరుపతి, కాంగ్రెస్ మండల నాయకులు శనివారం మండలకేంద్రంలో వేములవాడ రాజన్న లడ్డూ ప్రసాదాన్ని గ్రామస్తులకు అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తూము జలపతి, గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, తర్రె లింగం, నాయకులు ఎర్రం గంగ నర్సయ్య, పరందాము, పల్లి గంగాధర్, గండి నారాయణ, దర్న మల్లేశం, ఇప్ప మహేశ్, యాదయ్య, మహిపాల్, గంగాధర్, శ్రీనివాస్, తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత

కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేటలో మృతుడి కుటుంబానికి విదేశాల్లో ఉంటున్న యువకులు ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన బొడ్డు బాబు బహ్రెయిన్‌కు వెళ్లి అక్కడ జరిగిన ప్రమాదంలో మృతిచెందాడు. మృతుడికి భార్య, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. విదేశాల్లోని యువకులు గొల్లపల్లి రవీందర్, కత్తి నాగరాజు, దొంతర వేణి శ్రీకాంత్, సతీశ్, రహీం, గణేశ్, అనిల్, ఉమర్, ప్రేమ్‌చంద్, వెంకటేశ్, అజయ్ నగదును సేకరించారు. శనివారం 50 కిలోల బియ్యం, రూ. 10వేల నగదును ముష్కం గంగాధర్, గొల్లపల్లి రాము, గొల్లపల్లి శ్రీనివాస్, దేవయ్య, సునీల్ అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని ఆసాముల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిని కోరారు. శనివారం సిరిసిల్లలోని కేకే నివాసంలో కలిసి మాట్లాడారు. పద్మశాలీ సంఘం పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణ, ఆసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, ప్రధాన కార్యదర్శి చేరాల అశోక్, ఉపాధ్యక్షుడు పోరండ్ల శ్రీనివాస్, గాజుల శంకర్, అంకం దేవదాసు, బచ్చు రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలు



వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో గ్రామీణ ప్రాంత కిశోర బాలికల జీవన నైపుణ్యాల కోసం టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల ప్రాంతం విద్యార్థినులు అధునిక ప్రపంచంతో పోటీపడేలా జీవన నైపుణ్యాలను పెంపొందిచేందుకు ప్రణాళికలు రూపొదించినట్లు తెలిపారు. విద్యార్థినులకు సైన్స్‌పాఠాలు, ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్ వివిధ సబ్జెక్టుల్లో నైపుణ్యం పెంపొందిచేందుకు ప్రత్యేక పరికరాలు ఏర్పాటు చేశామన్నారు. వివిధ రకాల మెటీరియల్స్‌ను విద్యార్థుల కోసం తీసుకువచ్చినట్లు తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, డీఈవో రమేశ్, సీడీపీవో సుచరిత, పద్మజ, రోజా, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలకేంద్రానికి చెందిన పాపగారి లక్ష్మీనారాయణగౌడ్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ముగిసిన శిక్షణ తరగతులు



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలోని డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో కేరీర్ గైడెన్స్ సెల్‌విభాగం ఆధ్వర్యంలో టాస్క్‌లో భాగంగా నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. విద్యార్థులకు జీవన నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్ పెంపొందించడమే లక్ష్యంగా శిక్షణనిచ్చారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, కేరీర్ గైడెన్స్ సెల్ కో ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ దాసు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ ఆంజనేయులు, వాణి, భిక్షమయ్య, విష్ణు, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ముస్తాబాద్: మండలంలోని రామలక్ష్మణపల్లెలో మానేరువాగులో ఇసుక ట్రాక్టర్ పట్టుకున్నామని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టామన్నారు. ఆవునూర్, తుర్కపల్లి, గండిలచ్చపేట గ్రామాల నుంచి ఇసుక రవాణా చేస్తున్నారనే సమాచారం ఉందన్నారు.

నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలి

సిరిసిల్లటౌన్: నేరెళ్ల బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్ అన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక స్మగ్లర్ల లార్రీ ఓ సామాన్యుడిని బలిగొంటే స్పందించిన నేరెళ్ల యువకులను అప్పటి పోలీస్ అధికారులు అదుపులోకి తీసుకుని థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటి పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం, మానవ హక్కుల సంఘం, ఎస్సీ, ఎస్టీ కమీషన్లు పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోలేదన్నారు. విచారణ జరిపి బాధ్యులపై కేసు నమోదు చేయాలన్నారు. నేరెళ్ల బాధితులు కోల హరీశ్, పెంట బానయ్య, పసుల ఈశ్వర్, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రవెల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

చందుర్తి : చందుర్తిలోని పోలింగ్ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలలోనే ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచ్ గొట్టే ప్రభాకర్, నాయకులు పులి సత్తయ్య, లింగంపల్లి అజయ్ తహసీల్దార్ శ్రీనివాస్‌కు శనివారం వినతిపత్రం అందించారు. చందుర్తిలో నాలుగు పోలింగ్ కేంద్రాలు ఉండగా రెండు కేంద్రాలను ప్రాథమిక పాఠశాలలో, మరో రెండు కేంద్రాలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో 103,104ను ఏర్పాటు చేశారు. ఈ రెండు కేంద్రాలను ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసి ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



అర్చన

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన ముద్రకోల అర్చన అనే విద్యార్థిని జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికై ంది. నవంబర్‌లో మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికై ంది. ఈనెల 25నుంచి 30 వరకు తమిళనాడులోని త్రిచరాపల్లిలో జరిగే జాతీయస్థాయి అండర్ 17 ఇయర్స్ పోటీల్లో అర్చన పాల్గొననుంది. ఈ సందర్భంగా అర్చనను సర్పంచ్ పాశం సరోజన, ఎంపీటీసీ ల్యాగల శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దేవత ప్రభాకర్, డీవైఎస్‌వో రాందాస్, ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు మురళి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు..

సిరిసిల్ల: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) పోటీలకు సిరిసిల్ల విద్యార్థి గోలి శ్రీవాత్సవ్ ఎంపికయ్యారు. సిరిసిల్ల మినీస్టేడియంలో జరిగిన పోటీల్లో ప్రతిభ చాటిన శ్రీవాత్సవ్‌ను నల్గొండ జిల్లా మిర్యాలగూడలో ఈనెల21నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. శ్రీచైతన్య స్కూల్‌లో చదివే శ్రీవాత్సవ్ అండర్–14 విభాగంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో ఎంపికయ్యారు. శ్రీవాత్సవ్‌ను డీఈవో రమేశ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి దేవత ప్రభాకర్, ఉపాధ్యాయులు అభినందించారు.



శ్రీవాత్సవ్‌ను అభినందిస్తున్న అధికారులు



సాయిప్రణయ్

కోనరావుపేట: మండలంలోని కనగర్తి ఉన్నత పాఠశాలకు చెందిన పులి సాయి ప్రణయ్ జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ అజయ్‌కుమార్ తెలిపారు. సిరిసిల్లలోని మినీస్టేడియం జరిగిన 19వ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్నాడు. అండర్–16 విభాగంలో లాంగ్‌జంప్‌లో జిల్లాస్థాయిలో రెండోస్థానంలో నిలిచాడు. జాతీయస్థాయి పోటీలు ఫిబ్రవరి మొదటి వారంలో గుజరాత్‌లో జరగనున్నాయి. ఈ సందర్భంగా సాయిప్రణయ్‌ను హెచ్‌ఎం వినోద్‌కుమార్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

గంభీరావుపేట(సిరిసిల్ల): రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు(అండర్–14) మండలంలోని భీముని మల్లారెడ్డిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన జక్కుల నవదీప్ ఎంపికయ్యాడు. నవదీప్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింగారావు, ఉపాధ్యాయులు శంకర్, కనుకయ్య, రాంచంద్రం, రమేష్, పీఈటీ నరేష్‌లు అభినందించారు.

ఆదిని 'విప్'గా నియమించడంపై హర్షం

- నేడు వేములవాడకు రాక
- జిల్లెల్ల వద్ద స్వాగతం పలికేందుకు సన్నాహాలు

వేములవాడ: వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ విప్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కాంగ్రెస్ నాయకులు సాగారం వెంకటస్వామి, చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, సంగ స్వామి, నాగం కుమార్, పాత సత్యలక్ష్మి తదితరులు హర్షంవ్యక్తంచేశారు.

నేడు జిల్లాకు ఆది శ్రీనివాస్

ప్రభుత్వవిప్‌గా ఆది శ్రీనివాస్ నియమితులై ఆదివారం మొదటిసారి జిల్లాకు వస్తున్న సందర్భంగా జిల్లా కాంగ్రెస్, వేములవాడ నాయకులు జిల్లెల క్రాసింగ్ నుంచి బైక్ ర్యాలీగా సిరిసిల్ల మీదుగా వేములవాడ వరకు స్వాగతం పలికేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగారం వెంకటస్వామి, వేములవాడ అర్బన్, రూరల్, కోనరావుపేట చందుర్తి, మండల అధ్యక్షులు పిల్లి కనకయ్య, వకుళాభరణం శ్రీనివాస్, షేక్ ఫిరోజ్, చింతపండు రామస్వామి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, నాయకులు చిలుక రమేశ్, కొమరయ్య, రాకేశ్, పులి రాంబాబుగౌడ్, కరుణాకర్, ముప్పిడి శ్రీధర్, విష్ణు, సాబీర్, గుర్రం తిరుపతి, సిరిగిరి శ్రీకాంత్, అరుణ్ తేజచారి, అడగట్ల అనిత, నాగుల మహేశ్, దాడి మల్లేశం, కృష్ణ, రాజేశం, ఫెరోజ్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట–లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు పొంగిపొర్లినప్పుడల్లా లోలెవల్ బ్రిడ్జి మునగడం, రాకపోకలకు రోజుల తరబడి అంతరాయం ఏర్పడేది. రెండేళ్ల క్రితం వరదలో ఆర్టీసీ బస్సు కూడా కొట్టుకుపోయింది. ఈ నేపథ్యంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం మండల ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ కృషితో రూ.14కోట్ల అంచనాతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ కంపెనీ టెండర్ దక్కించుకొని పనులు ప్రారంభించింది. పనులకు మోక్షం లభించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లనాటి మునక కష్టాలు దూరం కానున్నాయని భావిస్తున్నారు.



సింగసముద్రం గండ్ల పూడ్చివేతకు నిర్ణయం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రం శివారులోని సింగసముద్రం ఆయకట్టు పరిధిలోని కాలువల వెంట గండ్లను సాగునీటి విడుదలకు ముందు పూడ్చివేయాలని రైతులు, నాయకులు నిర్ణయించారు. ఎల్లారెడ్డిపేట పంచాయతీ ఆవరణలో శనివారం ఆయకట్టు రైతులు సమావేశమయ్యారు. సింగసముద్రం నుంచి ఎల్లారెడ్డిపేటకు వచ్చే సాగునీటి కొమటికుంటతో పాటు పలుచోట్ల కాలువల వెంట గండ్లు పడ్డాయి. కాలువల కనెక్టింగ్ చైర్మన్ ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్ ఆధ్వర్యంలో సర్పంచ్ బాల్‌రెడ్డి, రైతులు గండ్లను పరిశీలించారు. జేసీబీ సాయంతో వారంరోజుల్లో కాలువల వెంట ఉన్న గండ్లను పూడ్చివేసి సాగునీటిని విడుదల చేయాలని రైతులు కోరారు. ఈ నిర్ణయాన్ని అందరూ తీర్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వంగ బాపురెడ్డి, రైతులు రాగుల తిరుపతిరెడ్డి, సత్తయ్య, రాజు, నర్సింలు, బింగి మల్లేశం, రాజయ్య, హన్మయ్య, రాజ్‌యాదవ్, ముత్యాల బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.